# సద్యోగం

శారంకి ప్రమీలారాణి

సాయంకాలమైంది. స్కూళ్ళ నుండి, కాలేజీలనుండి వచ్చే విద్యార్థులు, ఆఫీసుల నుండి, పనుల నుండి వచ్చే పిల్లలతో ఆ సాయంత్రం రాగరంజితమౌతోంది. అలసిపోయినవాళ్ళ మొహాలు ఉత్సాహంగా ఉన్నాయి. ఏదో సాధించామన్న తృప్తితో మెరుస్తున్నాయి.

డాబాపైన ఆరేసిన బట్టల్ని తీస్తున్న మాలతి వీళ్ళందర్నీ చూసి గాఢంగా నిట్టూర్చింది. వాళ్ళంతా సమయాన్ని అర్థవంతంగానూ, ఉపయోగకరంగానూ గడుపుతున్నట్లు, తనొక్కతే సమయాన్నంతా వృధా చేస్తున్నట్లు అన్పించింది. ఇంతలో భర్త శ్రీధర్ రావడం చూసి మడత పెట్టిన బట్టల్ని క్రిందకు తీసుకువచ్చింది.

''ఏమిటోయ్! డాబామీదే దీర్ఘాలోచనలో పడ్డావ్?'' అన్నాడు శ్రీధర్.

''ఆలోచనకేముంది. మీకు కాఫీ కావాలా?''

''ఆ... ఇవ్వు. స్నానం చేసి వస్తాను. రాఘవ టెన్నిస్ మ్యాచ్ చూడడానికి రమ్మన్నాడు'' అంటూ బాత్రూమ్‌లోకి వెళ్లాడు శ్రీధర్.

ఆ రాత్రి శ్రీధర్‌తో తనకు ఉద్యోగం చేయాలని వుందన్న విషయం మరోసారి చెప్పింది మాలతి.

''ఇప్పుడు నీకు ఉద్యోగం ఎందుకు? మనకేం లోటు?'' అన్నాడు శ్రీధర్.

''లోటు గురించి కాదండీ. ఎమ్ఎ సైకాలజీ చదివాను. నిన్న మొన్న చదువుకున్న పిల్లలు ఉద్యోగాలని, వ్యాపారాలని, కంప్యూటర్స్ అని ఎన్నో పనులు చేస్తున్నారు. నేను ఇంటికే పరిమితమయ్యానని బాధగా వుంది. ఇంటి పని తక్కువైందనికాదు. కానీ ఇంట్లో పని కూడా పెద్దగా వుండదు. పిల్లలు పెద్దవాళ్ళయ్యారు. వాళ్ళ పని వాళ్ళు చేసుకుంటారు, చదువుకుంటారు. బైట పని చేయడానికి మనిషి వుంది. ఏదైనా ఉపయోగకరమైన పని చెయ్యాలని వుంది.''

''అయితే బ్యాంక్‌కొచ్చి నా ఎదురుగా కూర్చో'' నవ్వుతూ అన్నాడు శ్రీధర్.

''బాగుంది. ఏం చెప్పినా జోక్‌గా తీసుకుంటారు. ఎలా మీతో?'' విసుగ్గా అంది మాలతి.

''లేకపోతే ఏమిటి? మా బ్యాంక్‌లో ఆడవాళ్ళు 'అబ్బా...హాయిగా ఇంట్లో వుండక ఎందుకొచ్చిన ఉద్యోగాలు అనుకుంటారు' నువ్వేమో ఉద్యోగం అంటావు. కాలక్షేపం కోసం లేడీస్‌క్లబ్‌లో చేరమంటే ఎన్నిసార్లు చెప్పినా వినవు. నేనేం చేయను.''

''బాగుంది. లేడీస్‌క్లబ్‌లు సమావేశమయ్యేది సాయంత్రంవేళ. పైగా అక్కడ నాకంటే హోదాగల మహిళలు చేరతారు. వాళ్ళు కాలక్షేపం చేసేది సాయంకాలంవేళ. నాకు పని కావలసింది మీరూ, పిల్లలు ఇంట్లోలేని వేళ'' అంది మాలతి.

''అందుకే భారం లేకుండా మా బ్యాంక్‌కొచ్చి కూర్చో.''

ఈసారి మాలతి విసుక్కోలేదు. తనే ఏదో మంచి కాలక్షేపం చూసుకోవాలి. అది తనకే కాదు, కాస్త సమాజానికి పనికొచ్చేదయితే? బాగానే వుంటుంది. కానీ తనొక్కతే సమాజానికి ఏం సేవ చేస్తుంది? ఆలోచించింది.

అయితే మనం మనసులో గాఢంగా అనుకునేవి, మనకు కావాలనుకునేవి అనుకోకుండా ఎదురవుతాయి.

దీపావళి దగ్గర పడింది. మాలతి ఇంటికి కావాల్సిన సరుకులు తెచ్చుకోవడానికి దగ్గరలోగల బజారుకి బయలుదేరింది. ఒక్కో షాపే చూసుకుంటూ చేతిలో బాస్కెట్ మార్చుకుంటూ నడుస్తోంది మాలతి. ఇంక కావలసినవి పువ్వులు. మధ్యాహ్నం మూడుగంటలు దాటడంతో పూల దుకాణంవాళ్ళు పూలదండలు సర్దుకుంటున్నారు. మాలతి గులాబీలు, కనకాంబరాలు, బంతిపూలు, కాగడమల్లె తీసుకుంటోంది. మోచేతి దగ్గర ఎవరో తాకడంతో వెనక్కి తిరిగింది. ఎవరో అమ్మాయి. దాదాపు పదిహేను సంవత్సరాల వయస్సు వుంటుంది. కానీ ఆ అమ్మాయి ఆ వయసు పిల్లలా లేదు. ఏదో అసహజత్వం. అదేమిటో తెలియడంలేదు. ఏదో మాట్లాడుతోంది. మాట స్పష్టంగా లేదు. ఇంతలో కళ్లజోడు పెట్టుకున్న ఒక నడివయసావిడ–

''సుశీలా! నువ్విక్కడున్నావా?'' అంటూ చేయి పట్టుకుని ఆ అమ్మాయిని తీసుకెళ్లింది. పువ్వులు కొని డబ్బులు ఇచ్చేసి వెనుతిరిగిన మాలతికి వాళ్లిద్దరూ రోడ్డుకి ఒక ప్రక్కగా వున్న చెట్లకిందకి వెళ్లడం గమనించింది. అక్కడ చాలామంది మనుషులున్నారు. అక్కడేం జరుగుతోందో అనే కుతూహలంతో మాలతి ఆ గుంపు దగ్గరగా వెళ్లింది. అక్కడ రోడ్డుమీద పేవ్‌మెంట్ ప్రక్కనే రెండు ఐరన్ టేబుల్స్ వేసి వున్నాయి. వాటిమీద జంతువుల, పక్షుల ఆకారంలో వివిధ సైజుల్లో కొవ్వొత్తులున్నాయి. రంగురంగు పూలతో తయారుచేసిన అల్లిక సామాన్లు వున్నాయి. కొంతమంది కొనుక్కుంటున్నారు. కొంతమంది వాళ్ళని వింతగా చూస్తున్నారు. కొనుక్కున్నావిడకు సుశీలను తీసుకెళ్లినావిడ రసీదులు ఇస్తోంది. ఇంకొకావిడ ప్లాస్టిక్ కవర్లో కొన్న వస్తువుల్ని ప్యాక్ చేస్తోంది. సుశీలలాంటి పిల్లలు చాలామంది ఆ చెట్లకింద పేవ్‌మెంట్ మీద వేసిన తివాసీమీద కూర్చున్నారు. వాళ్ళలో మూడు సంవత్సరాల పిల్లల దగ్గరనుండి పదిహేను సంవత్సరాల పిల్లలవరకు ఆడ, మగ పిల్లలు కూర్చున్నారు. కొందరు అందరినీ వింతగా చూస్తున్నారు. కొందరు నవ్వుతున్నారు. పెద్దపిల్లలు కూడా వయసుకు తగ్గట్టులేరు. మాలతి చెట్లు, నెమలి ఆకారాల్లో వుండే కొవ్వొత్తులు తీసుకుంది. వాళ్ళు రసీదు ఇచ్చారు. ఆ రసీదుమీద పేరు చూసింది.

'చైతన్య మానసిక వికలాంగుల పునరావాస కేంద్రం' అని వుంది. ఈ కేంద్రం తమ కాలనీలోనే వున్నట్లు ఇంతవరకూ తనకు తెలియదు. దీన్నిబట్టే అర్థమవుతోంది ప్రపంచానికి తను ఎంత దూరంగా వుంటోందో? వాళ్ళని మరోసారి పరిశీలనగా చూసింది. ఆడపిల్లలందరూ తెల్లటి పైజమా, గ్రే కలర్ కుర్తా వేసుకుని తెల్లటి చున్నీ, జడలకు నల్ల రిబ్బనులతో వున్నారు. మగపిల్లలు గ్రే కలరు పాంటు, తెలుపురంగు చొక్కాతో వున్నారు. ఇంతలో కేంద్రానికి సంబంధించిన వ్యాన్ వచ్చింది. పిల్లలందరూ ఆ వ్యాన్‌ను గుర్తు పట్టారు. ఒక్కసారిగా ఆ వ్యాన్ దగ్గరకు వెళ్లారు. వ్యాన్‌లో నుండి ఒక వ్యక్తి దిగి అందరినీ వరుసగా ఎక్కిస్తున్నాడు. ఇంక చూసేదేమీలేనట్టు మాలతి అక్కడినుండి కదిలి ఇంటికి బయలుదేరింది.

నడుస్తుంటే మాలతికి ఒకటే ఆలోచనలు. నిజంగా తను ఎంత అదృష్టవంతురాలో వీళ్ళని చూసాక అర్థమవుతోంది. శ్రీధర్ తన కోరికలన్నీ తీరుస్తున్నా ఇంకా ఉద్యోగం లేదనీ, కాలక్షేపం కావడంలేదని అప్పుడప్పుడు చీరలు, షికార్లు వీటి గురించి మనసు అసంతృప్తి పడుతూంటుంది. కానీ కళ్లు, కాళ్లు చేతులు, కొద్దోగొప్పో అందం, సంఘంలో హోదాగల భర్త, అంగవైకల్యం లేని పిల్లలు, సొంత ఇల్లు ఇన్ని వున్న

తను ఈ పిల్లలముందు ఎంత అదృష్టవంతురాలో అర్థమవుతోంది. తన అసంతృప్తికి సిగ్గుపడుతోంది.

ఆ రాత్రి భోజనాల దగ్గర ఈ కేంద్రం గురించి, తను చూసిన పిల్లల గురించి చెప్పింది.

''అదేమిటి! వాళ్ళని చూసిన తర్వాతైనా ఇంత కొద్ది సామాన్లు కొన్నావేమిటి? ఇంకా కొన్ని తీసుకోలేకపోయావా?'' అన్నాడు శ్రీధర్.

''ఏమోనండీ. వాళ్లని చూస్తే మనసులో నుండి అదోక బాధ పుట్టుకొచ్చింది. కేవలం డబ్బేకాదు, మనం వాళ్ళకేమైనా చేయాలి?''

''ఏం చేస్తాం అమ్మా! మా బట్టలు, పుస్తకాలు ఇస్తే?'' మాలతి కొడుకు శ్రీకాంత్ అన్నాడు.

''లేదు. వాళ్ళు వున్నవాళ్ళ పిల్లల్లానే వున్నారు. సహాయం అంటే కేవలం భౌతికంగా కాదు ఏదో చేయాలి?'' అంది మాలతి.

పండుగ వచ్చినా, వెళ్లినా ఆమెకా ఆలోచన పోలేదు. నవంబర్ నెల. ఎండలో కాస్త వెచ్చగా కూర్చుని పేపరు చూస్తున్న మాలతికి ఆ పునరావాస కేంద్రం గుర్తొచ్చింది. ఇప్పుడు చేసే పని కూడా లేదు. ఆమె వెంటనే తయారై పునరావాస కేంద్రాన్ని వెతుక్కుంటూ వెళ్లింది.

ఆమె వెళ్ళేసరికి పిల్లలు కొంతమంది నీరెండలో కూర్చుని కాగితం పువ్వులు తయారు చేస్తున్నారు. కొంతమంది క్లాసులో పాఠాలు వింటున్నారు. ఆఫీస్ అని వ్రాసివున్న గదిలోకి వెళ్లింది. అక్కడ ఆ రోజు సుశీలను తీసుకువెళ్లినావిడ కూర్చుని ఏవో పేపర్లు చూసుకుంటోంది. మాలతి ''రావచ్చా?'' అని అడిగి లోపలకు వెళ్లింది. ఆవిడ చెప్పండి అన్నట్లు చూసారు. మాలతికి ఏం మాట్లాడాలో తెలియలేదు. కాస్త గొంతు సవరించుకుని మొదలుపెట్టింది.

''నా పేరు మాలతి. మేమీ కాలనీలోనే వుంటున్నాం.''

''అలాగా. నా పేరు మహేశ్వరి. ఈ అప్లికేషన్ పూర్తి చేయండి. ఇంతకీ మీరు ఎవరిని చేరుస్తారు?'' అడిగిందావిడ.

తను పిల్లల్ని చేర్చడానికి వచ్చాననుకుంటోంది ఈవిడ. మాలతి కంగారుపడింది.

''అబ్బే లేదండీ. నేను ఈ పునరావాస కేంద్రం గురించి తెలుసుకున్నాదే ఈ మధ్య'' అంది.

''అవునవును. ఆ రోజు పూలదుకాణం దగ్గర కనబడింది మీరే కదూ'' అందావిడ.


''అవును. అప్పట్నుంచి మీ కేంద్రానికి వద్దామంటే ఏదో పనితో సరిపోయింది.''

''మీరు కేంద్రం గురించి ఏమైనా వ్రాస్తారా?''

''లేదు. మీకు వీలైతే...అదే మీరు ఒప్పుకుంటే ఉద్యోగం చేద్దామని వచ్చాను'' మాలతి మాటలకోసం తడుముకుంది. ఎలా చెప్పాలో అర్థం కాలేదు.

''అది కాదు మేడమ్. నేను సైకాలజీలో ఎమ్ఎ చదివాను. నా పిల్లలిద్దరూ ఒకరు కాలేజీలోనూ, ఒకరు హైస్కూల్‌లోనూ చదువుతున్నారు. నిజానికి ఉద్యోగం చేసే అవసరంలేదు. కానీ చదివిన చదువు వృధా కాకుండా ఏదైనా చెయ్యాలని వుంది. పదిరోజుల క్రితం ఈ కేంద్రం గురించి తెలిసింది. ఇక్కడ నేను చేయగల పని ఏదైనా ఇస్తే చెయ్యాలనివుంది.''

ఆవిడ ముఖంలో ఇప్పుడు కాస్త ప్రశాంతత కనబడుతోంది.



''చూడండి మాలతీగారూ! ఇదేదో స్కూలనీ, ఆడుతూపాడుతూ పిల్లలకి పాఠాలు చెప్పి జీతం తీసుకువెళ్లిపోదామనుకుంటారు. ఇక్కడ జ్ఞానం కన్నా సహనం ఎక్కువ కావాలి. చాలా బాధ్యతగా ఉండాలి. అన్నింటినీ మించి ఆ పిల్లలపట్ల జాలిలేని ప్రేమ కావాలి. ఇవన్నీ వుంటేనే ఇక్కడ వుండగలరు. ఇంతకుముందు ఇద్దరు ముగ్గురు రూ.1500, రూ.2000 చాలంటూ చేయలేక మానుకున్నారు. ఇది కేవలం ఇటువంటి మానసిక వికలాంగులైన పిల్లల తల్లిదండ్రులు పెట్టిన కేంద్రం. మా అబ్బాయి ఇందులోనే వున్నాడు.''

మాలతికి ఆ మాటలు మరింత బాధ కలిగించాయి.

''మేడమ్! మీరు చెప్పిన లక్షణాలన్నీ ఎక్కువగా నాలో లేకపోయినా కొంచెమైనా నాలో వున్నాయనుకుంటున్నాను. ముఖ్యంగా నాకు కావలసింది సేవ చేస్తున్నాననే తృప్తి తప్ప జీతం కాదు.''

''మీకు జీతం వద్దా?'' ఆవిడ ఆశ్చర్యపోయింది.

''అవును మహేశ్వరిగారూ! ఇన్నాళ్ళూ ఉద్యోగం...ఉద్యోగం అని మా ఆయన్ని సాధిస్తూ వుండేదాన్ని. ఇప్పుడు వీళ్ళని చూసాక నాకు కావాల్సింది ఏమిటో తెలిసింది. దయచేసి నాకొక అవకాశం ఇవ్వండి. మీకెప్పుడు నచ్చకపోతే అప్పుడు తొలగించండి.''

''అయ్యో ఎంత మాటన్నారు? మీలాంటి వాళ్ళు ముందుకొస్తేనే నాలాంటి తల్లిదండ్రులకు చేయూతగా వుంటుంది. కనీసం మీవంటివాళ్ళయినా ఉద్యోగం కోసం పరుగెత్తకుండా ఇటువంటి సద్యోగాలు చేయాలి'' అంటూ తృప్తిగా లేచింది మహేశ్వరి.

★